క్లుప్తంగా

ధరూరులో రోడ్డుకు మరమ్మతు



ధరూరు: గద్వాల–రాయచూరు ప్రధాన రహదారి ధరూరులో గుంతలమయంగా తయారైన విషయం తెలిసిందే. ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామ పంచాయతీ సిబ్బంది మట్టి వేసి మరమ్మతు పనులు చేపట్టారు. పెద్ద పెద్ద గుంతల్లో మట్టి పోసి చదును చేశారు. ఆదివారం సాయంత్రం మార్కెట్ యార్డు మాజీ డెరెక్టర్ కర్రెప్ప, శంకర్‌లు దగ్గరుండి చదును చేయించారు. ఏది ఏమైనా శాశ్వత ప్రాతిపదికన గోనుపాడు తరహాలో సీసీ రోడ్డు వేసి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డైవర్షన్ రోడ్డుకు..



అయిజ: మండలంలోని పోలోని వాగువద్ద నిర్మిస్తున్న వంతెన పక్కన డైవర్షన్ రోడ్డుకు ఆదివారం మరమ్మతు పనులు చేశారు. దీంతో ప్రయాణికులకు ఊరట లభించింది. పులికల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా పోలోని వాగుపై వంతెన నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. ప్రయాణికులు వెళ్లేందుకు కొన్ని రోజుల క్రితం డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఇటీవల భారీ వర్షాలకు డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయి ప్రయాణానికి ప్రతికూలంగా మారింది. ఆర్‌అండ్‌బీ అధికారుల ఆదేశాలతో కాంట్రాక్టర్ డైవర్షన్ రోడ్డుకు మరమ్మతు చేయించారు. దాని వల్ల రాకపోకలు మొదలయ్యాయి.

కాజ్‌వేకు కాల్వ ఏర్పాటు



అయిజ: పట్టణ సమీపంలోని రాయచూర్–కర్నూల్ రోడ్డుపై నిర్మించిన కాజ్‌వే వద్ద మున్సిపల్ కౌన్సిలర్ గిత్తల దేవరాజు సొంత ఖర్చులతో ఆదివారం కాల్వను ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాజ్‌వే పై నీళ్లు నిలవడంతో ప్రయాణికులు ఇబ్బందులు గురయ్యారు. కాల్వ తీయించడంతో వర్షం నీరు పక్కకు వెళ్లిపోయింది.

కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కోవాలి



అయిజ: కాంగ్రెస్ ప్రభుత్వం నిద్ర నుంచి మేల్కోవాలని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యాలయం కోసెక్రటరీ శేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌ను ఆయన సందర్శించి, విద్యార్థులకు అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడారు. బీసీ హాస్టళ్లలో గతంలో విద్యార్థులకు వారానికి ఆరు గుడ్లు, ఆరు పండ్లు ఇచ్చేవారని, ఇప్పుడు వారానికి ఒక గుడ్డు, ఒక పండు ఇస్తున్నారంటే విద్యార్థుల పట్ల కాంగ్రెస్ పార్టీ వైకరి ఏమిటో అర్థమవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు పోషకాహారం అందేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చ ఉపాధ్యక్షులు ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు పరశురామ్, గోపాల్, వీరేంద్ర, వినోద్, రమేష్ పాల్గొన్నారు.

'మన్‌కీ బాత్' వీక్షించిన నాయకులు



అయిజ: పట్టణంలోని బీజేపీ నాయకులు ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడారు. దేశ ప్రజలను ఉత్తేజ పరుస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహిస్తున్న మన్‌కీ బాత్ కార్యక్రమం ప్రజల్లో స్ఫూర్తిని నింపుతుందన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భీమ్‌సేన్ రావు, మండల బీజేపీ అధ్యక్షుడు గోపాల కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, లక్ష్మణాచారి, వెంకటేష్, వీర రాఘవరెడ్డి పాల్గొన్నారు.

రహదారిపై వసతులేవి?

- నిరుపయోగంగా హైవే బస్‌షెల్టర్లు
- మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ప్రయాణికుల అవస్థలు
- ట్యాంకులు నిర్మించినా నీటి వసతి కరువు
- ప్రయాణికుల పాట్లు.. పట్టించుకోని అధికారులు



కనీస వసతులకు నోచుకోని బీచుపల్లి కూడలి

ఎర్రవల్లి: నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే 44వ జాతీయ రహదారిపై కనీస వసతుల్లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపై అధికారులు నిత్యం పర్యవేక్షించి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సి ఉంటుంది. రోడ్ల నిర్మాణ సమయంలో రక్షణ చర్యలతో పాటు, వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలి. ప్రధాన కూడళ్ల వద్ద బస్‌షెల్టర్లు, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలల వంటి అత్యవసరమైన కనీస వసతులు ఏర్పాటు చేయాలి. కానీ అలంపూర్ నియోజకవర్గంలో 44వ జాతీయ రహదారిపై కనీస వసతులు కరువయ్యాయి. వీటిని ఏర్పాటు చేయడంలో హైవే అధికారులు పూర్తిగా విఫలమైనట్లు ప్రయాణికులు పేర్కొన్నారు.

నియోజకవర్గంలో రద్దీగా ఉండే కూడళ్లు..

అలంపూర్ నియోజకవర్గంలో 44వ జాతీయ రహదారి బీచుపల్లి బ్రిడ్జి నుంచి పుల్లూరు స్టేజీ వరకు సుమారు 46 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. రహదారిపై మొత్తం 25 బస్‌షెల్టర్లు ఉండగా, అందులో చాలా వరకు నిరుపయోగంగా ఉన్నాయి. రహదారిపై బీచుపల్లి, ఎర్రవల్లిచౌరస్తా, కోదండాపురం స్టేజీ, పొగాకు కంపెనీ, మానపాడు స్టేజీ, జల్లాపురం స్టేజీ, అలంపూర్ చౌరస్తా, పుల్లూరు స్టేజీ వంటి ప్రధాన కూడళ్లున్నాయి. అటువంటి కూడళ్లలో హైవే అధికారులు కనీస వసతులు కల్పించలేదు. బస్‌షెల్టర్లు, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికుల బాధలు అత్యవసర పరిస్థితులలో వర్ణనాతీతంగా ఉంటాయి.



ముళ్లపొదల్లో కొండపేట తాగునీటి వాటర్ ట్యాంకు

నిరుపయోగంగా బస్‌షెల్టర్లు, తాగునీటి ట్యాంకులు

జాతీయ రహదారిపై హైవే అధికారులు నిర్మించిన బస్‌షెల్టర్లు, తాగునీటి ట్యాంకుల వల్ల ప్రయాణికులకు ఎలాంటి ఉపయోగం లేదు. ప్రధాన కూడళ్లలో కాకుండా సుమారు రెండు, మూడు వందల మీటర్ల దూరంలో బస్‌షెల్టర్లు నిర్మించారు. కూడళ్లలో కనీస వసతులు కల్పించాలని పలుమార్లు హైవే అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రధాన కూడళ్లలో ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి..



జాతీయ రహదారిపై ప్రయాణికులకు కనీస వసతుల కల్పనలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. దీనివల్ల ప్రయాణికులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులకు స్పందించి కూడళ్లలో ప్రయాణికులకు అవసరమైన నీడతో పాటు, తాగునీటి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– రవికుమార్, వాహనదారుడు

వసతులు కల్పించాలి



నిత్యం రద్దీగా ఉండే ఎర్రవల్లి, బీచుపల్లి, అలంపూర్ కూడళ్లలో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో రోడ్డు పక్కన వాహనాలు నిలపడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధాన కూడళ్లలో పార్కింగ్ స్థలాలతో పాటు మరుగుదొడ్లు, మూత్రశాలల ఏర్పాటుకు హైవే అధికారులు కృషిచేయాలి.

– మారుతి, ప్రయాణికుడు

అటెన్షన్ ప్లీజ్



మానవపాడులో మండల వ్యవసాయ కార్యాలయం ఎదురుగా దర్శనం ఇస్తున్న అపరిశుభ్రత

పారిశుద్ధ్యంపై దృష్టిపెట్టండి

మానవపాడు: పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. మండల కేంద్రంలో పారిశుద్ధ్య సమస్యలపై పట్టించుకునే నాథుడే కరువైయ్యాడు. మండల వ్యవసాయ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. మండల కేంద్రంలోని ప్రధాన కార్యాలయాల వెలుపల అపరిశుభ్రంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

సంప్రదించవలసిన అధికారి : భాస్కర్, ఎంపీఓ మానవపాడు సెల్ నెంబర్:
99667 270889

మద్యానికి బానిసవుతున్న యువత

- రోడ్డు ప్రమాదాల్లో జీవితాలను కోల్పోతున్న వైనం
- తల్లిదండ్రులకు తీరనిశోకం

కేటీదొడ్డి: యువత మార్పును ఆశించే కొత్తతరం అవకాశాలను అందిపుచ్చుకొని భవితకు బాటలు వేసుకునే నవశక్తి, తలుచుకుంటే ఏదైనా సాధించే ఆత్మవిశ్వాసం వారి సొంతం. కొందరు చెడు వ్యసనాలకు బానిసై పెడదోవపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. భావిపౌరులు వ్యసనాలకు బానిసవుతూ భవితను ప్రశ్నార్థకంగా మార్చుకుంటున్నారు. మద్యం, పొగతాగడం వంటి దురలవాట్లకు బానిసవుతున్నారు. దీంతో చిన్న వయస్సులోనే రోగాలపాలవుతున్నారు. వారిని రక్షించుకునేందుకు తల్లిదండ్రులు నానాపాట్లు పడుతున్నారు. కొందరు రోగాలతో మంచానికే పరిమితమవుతుంటే, మరి కొందరు మద్యం తాగి వాహనాలు నడుపుతూ తిరిగిరాని లోకాలకు వెళ్తున్నారు.

మద్యానికి బానిసై..

మండలంలోని గంగన్‌పల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు ఇటీవల మద్యం తాగి వాహనం నడపడంతో అదుపుతప్పి కిందపడి అస్పత్రి పాలయ్యాడు. మండల కేంద్రానికి చెందిన మరో యువకుడు మద్యం తాగి బైక్‌పై నుంచి కిందపడటంతో ప్రాణాలు కోల్పోయి వారి తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చాడు. ఇలా అనేక ఘటనలు తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగల్చాయి. పోలీసులు స్వచ్ఛంద సంస్థలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువకుల్లో పరివర్తన తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



కేటీదొడ్డిలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న పోలీసులు

శ్రావణమాస సామూహిక యజ్ఞం



యజ్ఞంలో పాల్గొన్న దంపతులు

గద్వాల టౌన్: ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో శ్రావణ మాస సామూహిక యజ్ఞం వైభవంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక దయానంద విద్యామందిర్‌లో జరిగిన యజ్ఞంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్య సమాజ్ ప్రతినిధి విట్టల్‌రావు ఆర్య, వైదిక ధర్మ ప్రచారకురాలు, మాజీ డీఎస్పీ నళిని పాల్గొని పూజలు నిర్వహించారు. యజ్ఞ బ్రహ్మ అంటూ... దంపతులతో యజ్ఞ కార్యక్రమాలు చేయించారు. పలువురు దంపతులు యజ్ఞంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆర్యసమాజ్ ప్రతినిధులు యజ్ఞం విశిష్టతను, వైదిక ధర్మాన్ని వివరించారు. పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పుట్ట శ్రీనివాస్‌ఆర్య, అరుణాత్‌రెడ్డి, సత్యకుమార్ పాల్గొన్నారు.

ఏఈఓ సేవలు మరువలేనివి



ఏఈఓను సన్మానిస్తున్న రామాపురం రైతులు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీ అయిన ఏఈఓ జయశ్రీ సేవలు మరువలేనివని గ్రామ రైతులు తెలిపారు. బదిలీపై పెబ్బేరుకు వెళ్తున్న ఆమెను రైతులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రైతులకు ఏఈఓ చేసిన సేవలు వారు కొనియాడారు. అనంతరం గ్రామానికి కొత్తగా వచ్చిన ఏఈఓ భరత్ భూషణ్‌ను రైతులు శాలువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో దామోదర్ రెడ్డి, లక్ష్మీరెడ్డి, మహేష్, గజేందర్‌రెడ్డి, పుల్లారెడ్డి, విశ్వనాథరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తిక్కయ్య, ఆంజనేయులు, అర్జున్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

ప్రమాదకర గుంతలు.. ప్రయాణానికి అవస్థలు



మానవపాడు: ఏళ్లుగా గుంతలతో సవాసం, ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్నిసార్లు వచ్చినా మానవపాడు–అలంపూర్ చౌరస్తాకు వెళ్లే రోడ్డు దుస్థితి మారడం లేదు. రాత్రి సమయంలో గుంతలతో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం



మానవపాడు: ఒరిగిన విద్యుత్ స్తంభాలు ప్ర మాదాలకు నిలయంగా మారాయి. మానవపాడు–గోకులపాడు దారిలో, చెన్నిపాడు మూలమలుపు వద్ద విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

కృష్ణం వందే జగద్గురు

- విగ్రహం నుంచి పూలు పడితే అనుకున్నది సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం
- నేటి నుంచి శ్రీకృష్ణస్వామి బ్రహ్మోత్సవాలు
- సద్దలోనిపల్లిలో 27న రథోత్సవం

మల్దకల్: భక్తుల కోరికలు తీర్చే శ్రీకృష్ణస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలోని సద్దలోనిపల్లి స్వయంభూ శ్రీకృష్ణస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి 28 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు పాండురంగాచారి, గ్రామ పెద్దలు తెలిపారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. 26న ఉదయం పూజా కార్యక్రమాలు, రాత్రి 12.05 గంటలకు కృష్ణస్వామి జననం, భాగవతం, గీతా పారాయణం, 27న పంచామృతాభిషేకం, అష్టోత్తర పూజ, మధ్యాహ్నం బలిమహానైవేద్యం, రాత్రి 11.05 స్వామివారి ఉట్లోత్సవం, అనంతరం11.45 స్వామివారి రథోత్సవం, తీర్థప్రసాదాల వితరణ, 28న స్వామివారి పారువేట కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

పూలు పడితే అనుకున్నవి సిద్ధిస్తాయి..

స్వామివారి మూలవిగ్రహం తలపై పూలు పెట్టి మనసులో మాట అనుకోవాలి. అలా అనుకున్న తరువాత పూలు కుడి వైపు కింద పడితే మనసులో అనుకున్నది తీరుతుందని భక్తుల నమ్మకం. అదే ఎడమ వైపు పూలు పడితే కోరికలు తీరవని పూజారులు చెప్తున్నారు. భక్తులకు అయిజ, గద్వాల ప్రధాన రహదారిలో ఉన్న సద్దలోనిపల్లికి చేరుకునేందుకు బస్సులు అందుబాటులో ఉన్నాయి. ఆలయానికి వచ్చే భక్తులు తగు జాగ్రత్తలు తీసుకుంటూ స్వామివారికి మొక్కులు తీర్చుకోవాలని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



సద్దలోనిపల్లిలోని శ్రీకృష్ణస్వామి ఆలయం



స్వామివారి మూలవిరాట్

చర్యలు తీసుకోవాలి

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని నిబంధనలకు విరుద్ధంగా ఆదివారం విద్యార్థులకు త రగతులు నిర్వహించిన పలు ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు నర్సింహ, కిరణ్‌లు ఒక ప్రకటనలో డి మాండ్ చేశారు. నిబంధనలకు తూట్లు పొడు స్తూ ప్రైవేటు పాఠశాలలు సెలవు రోజులైన రెండో శనివారం, ఆదివారాల్లో తరగతులు ని ర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గు రి చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, లేదంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

గట్టు: మండలంలోని మిట్టదొడ్డి గ్రామానికి చెందిన నర్సింహులుకు ఆదివారం సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.19 వేల చెక్కును ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అందజేశారు.

గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

మిట్టదొడ్డి గ్రామానికి చెందిన ఝాన్సీకి సీఎం సహాయ నిధిచెక్కు అందజేశారు. కార్యక్ర మంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ జంబురామన్‌గౌడు, మాజీ ఎంపీపీ విజయ్‌కుమా ర్, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్ పాల్గొన్నారు.

కేటీదొడ్డి: సీఎం సహాయ నిధి అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే నివాసంలోని సీఎం సహాయ నిధి ఎల్ఓసీని లబ్ధిదారులకు అందజేశారు. మండల కేంద్రానికి చెందిన కిష్టప్ప, చిన్న రా ములుగౌడు, రంగప్పలకు ఆపరేషన్ కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడంతో మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజశేఖర్, ఉ రు కుందు, చక్రధర్, హనుమంతు, స్వామి ఉన్నారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

ధరూరు: గ్రామీణ రోడ్లను పాలకులు ఎన్నికల సమయాల్లో మాత్రమే గుర్తు చేసుకుంటారు, ఆ తరువాత పట్టించుకునే నాథులే కరువయ్యారు. మండల కేంద్రం నుంచి గట్టు మండలానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ధరూరు పెట్రోల్ బంకు వద్ద నుంచి సీపీఎస్ స్కూల్ వరకు బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిని కలిగిస్తున్నాయి. మార్లబీడులో ప్రధాన రోడ్డుపై మోకాలి లోతు గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల్లో ఇటీవల కురిసిన వర్షపు నీరు నిలువడంతో లోతు తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఈ మార్గం గుండా వచ్చే వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఈ రోడ్డుపై దృష్టి సారించడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా, పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం, నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామని అధికారులు ఏళ్ల తరబడి ఇవే మాటలు చెబుతున్నారని పేర్కొన్నారు. వెల్లదీస్తున్న అధికారులపై వాహనదారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మార్లబీడులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పందులను తరలించండి



ఎర్రవల్లిలో రోడ్లపై స్వైరవిహారం చేస్తున్న పందుల గుంపు

ఎర్రవల్లి: మండల కేంద్రంలో పెంపకదారులు ఇండ్ల మధ్యనే పందులను పెంచడం వల్ల అవి నిత్యం ఇండ్ల చుట్టూ స్వైరవిహారం చేయటంతో ముురుగు పెరి గి విషజ్వరాల బారిన పడుతున్నామని వివిధ కాలనీల వాసులు పేర్కొన్నారు. స్థానిక అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేద ని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాకా లం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలడంతో పాటుగా పందులు కాలనీల్లో విచ్చలవిడి గా తిరగడం వల్ల గ్రామంలో మురుగు పెరిగి దు ర్వాసన వెదజల్లుతుందని తెలిపారు. పందుల స్వై ర విహారం వల్ల ఏ రోగం వస్తుందోనని రోజు భయభ్రాంతులకు గురవుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాటిపై చర్యలు తీసుకొని, గ్రామంలో పెరుగుతున్న పందులను గ్రామానికి దూరంగా తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.